సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 20 । ఆగస్టు । 2024



తాండూరు రూరల్: సోదరుడు నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



షాద్‌నగర్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి

మమతానురాగాల మేళవింపు

రాఖీ పర్వదినాన్ని సోమవారం ఊరూరా సోదర సోదరీమణులు ఘనంగా నిర్వహించుకున్నారు. అనురాగ మేళవింపును కలగలిపి తమకు రక్షగా ఉండాలని అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు తమ తోబుట్టువులతో రక్షాబంధన్ జరుపుకొని ప్రజలకు పండగ విశిష్టతను తెలియజేశారు.



ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రాఖీ కడుతున్న సోదరి

న్యూస్‌రీల్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తాం

జిల్లా రెవెన్యూ అధికారి సంగీత



అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ సంగీత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా, సత్వరమే పరిష్కరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పేర్కొన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి అభ్యర్థనలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఏడు ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అబ్దుల్లాపూర్‌మెట్: కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు, అడ్వకేట్ సంతోష్‌పై పోలీసులు అకారణంగా దాడి చేయడం అన్యాయమని హయత్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఈ మేరకు సోమవారం విధులు బహిష్కరించి జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు బొడ్డు భిక్షపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి నందుటి సంతోష్‌గౌడ్ జాయింట్ సెక్రటరీ బండి నరేష్, సభ్యులు సతీష్, ప్రభాకర్‌గౌడ్, రాజేష్, సరిత, రామ్మోహన్, నాగిరెడ్డి, శివకుమార్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జనవరి 18 నుంచి 'జేకేఏ' కరాటే టోర్నమెంట్

గచ్చిబౌలి: దేశంలోనే తొలిసారిగా జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జేకేఏ) ఆధ్వర్యంలో 'ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్- 2025' నిర్వహించనున్నట్లు 7వ డీఏఎన్ జేకేఏ హెడ్‌క్వార్టర్స్ ఇన్‌స్ట్రక్టర్స్ టకుయా తనియామా, ఆనంద్ రత్న షిహన్‌లు పేర్కొన్నారు. సోమవారం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని షెరటాన్ హోటల్‌లో వారు వెల్లడించారు. జేకేఏ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్స్ రాపోలు సుదర్శన్, దయానంద్‌కుమార్ మాట్లాడుతూ.. 2025 జనవరి 18 నుంచి 22 వరకు పోటీలు కొనసాగుతాయన్నారు.

చైర్ పర్సన్‌పై తిరుగుబావుటా

పెద్దఅంబర్‌పేటలో మెజార్టీ కౌన్సిలర్ల నిర్ణయం

- అదనపు కలెక్టర్‌కు 17 మంది అవిశ్వాస ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై మెజార్టీ కౌన్సిలర్లు తిరుగుబాటుకు జై కొట్టారు. ఆమెపై అవిశ్వాసం ప్రవేశ పెట్టాలని కోరుతూ 17 మంది కౌన్సిలర్లు.. అదనపు కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, పురపాలక సంఘం కమిషనర్లకు సోమవారం వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ప్రస్తుత పాలకవర్గం ఏర్పాటై మూడేళ్లు పూర్తయిన తర్వాత 2023 జనవరిలో సభ్యులు అవిశ్వాసం పెట్టిన విషయం తెలిసిందే. అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా అర్ధంతరంగా నిలిచిపోయింది. పీఠంపై గురిపెట్టిన మెజార్టీ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్‌పర్సన్ స్వప్నను గద్దె దింపే యోచనలో భాగంగా అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసును అందజేశారు. ప్రస్తుత చైర్‌పర్సన్‌తోపాటు ఈ పీఠాన్ని ఆశిస్తున్న పండుగుల జయశ్రీ కూడా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుండటం గమనార్హం. మొదటి నుంచి కాంగ్రెస్‌ను, మల్‌రెడ్డి సోదరులనే నమ్ముకున్న జయశ్రీకి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పదవిని కట్టబెట్టాలని పార్టీ యోచిస్తోంది. మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులుండగా అందులో 17 మంది కౌన్సిలర్లు ప్రస్తుత చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఉన్నారు.

రాజీనామాకు ససేమిరా

మొదటగా చెవుల స్వప్నను తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయిస్తే మేలని పార్టీ భావించినప్పటికీ అందుకు ఆమె ససేమిరా అనడంతో కౌన్సిలర్లంతా అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఫిర్యాదు చేసిన వారిలో గ్యారల శ్రీనివాస్, వడ్డేపల్లి విద్యావతి, పసుల రాజేందర్, దండెం కృష్ణారెడ్డి, పండుగుల జయశ్రీ, చల్లూరి మురళీధర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, మద్ది నరేందర్‌రెడ్డి, తొండెపు రోహిణి, పాశం అర్చన, మండలి కోటేశ్వరరావు, రమావత్ పరుశురాం, జోర్క గీత, ఓరుగంటి సుజాత, చెవుల హరిశంకర్, సిద్దంకి కృష్ణారెడ్డి, కందాడ అనుపమ ఉన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో నలుగురు కూడా పరోక్షంగా మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ చెవుల స్వప్న చేత ఎలాగైనా రాజీనామా చేయించాలనే బాధ్యతను పురపాలక సంఘానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతకు అప్పగించగా ఆయన మాట సైతం వినలేదు. దీంతో కౌన్సిలర్లు అవిశ్వాస బాట పట్టినట్లు విశ్వసనీయ సమాచారం.



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్లు



హయత్‌నగర్: నిరసన చేపట్టిన సీపీఐ నాయకులు

నిందితులను ఉరి తీయాలి

సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు

చేవెళ్ల: పశ్చిమబెంగాల్ కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లవుతున్నా మహిళలపై దాడులు కొనసాగడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు తీసుకు వచ్చినా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మండిపడ్డారు. అఘాయిత్యాలకు పాల్పడే నిందితులను కఠినంగా శిక్షిస్తేనే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, నాయకులు శివ, కృష్ణాగౌడ్, కె.శ్రీనివాస్, జలీల్, వెంకటయ్య, శౌరీ, యాదగిరి, లలితమ్మ, వెంకటమ్మ, పెంటయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

షాబాద్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పామలకుల జంగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేస్తున్న మహిళ డాక్టర్లపై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దోషులు ఎంతటి వారైన కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు శ్రీశైలం, రాములు, రఘురాం, మధు, నారాయణ, రుక్కయ్య, రాములు, పాండు, ఉదయ్‌కిరణ్, నాగమణి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై నిరసన

హయత్‌నగర్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ సీపీఐ దాని అనుబంధ సంఘాలు సోమవారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని రావి నారాయణరెడ్డికాలనీలో ఆందోళన నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని అనేక ప్రాంతాలలో అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించడం లేదన్నారు. అవసరమైతే నిందితులను శిక్షించేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకు రావాలన్నారు. ఈ దారుణానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, నాయకులు హరిసింగ్‌రాయక్, ప్రసాద్, మధు, వినోద్, నవనీత తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

కందుకూరు: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితుడిని వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు కందడి శ్రీరామ్, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ..పశ్చిమ బెంగాల్‌లో మహిళా ముఖ్యమంత్రి ఉండి కూడా మహిళలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టలేకపోతున్నారని విమర్శించారు. జూనియర్ డాక్టర్‌ను హింసించి హత్యాచారం చేయడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నొక్కి చెప్పారు. కార్యక్రమంలోహిందూ ఐక్య వేదిక నాయకులు నవీన్, మల్లేశ్, రమేశ్, అభిలాష్, రాజ్‌కుమార్, మణికంఠ, వినయ్, భాను, మనోహర్ పాల్గొన్నారు.

'మీ అమ్మ ఉరేసుకుంది'

- భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం
- కూతురు వచ్చేసరికి పరారైన తండ్రి

షాద్‌నగర్‌రూరల్: అనుమానం పెనుభూతమై ఓ ఇల్లాలి ప్రాణం తీసింది. భర్తే ఆమెను దారుణంగా కడతేర్చిన సంఘటన షాద్‌నగర్ పట్టణంలోని మల్లికార్జునకాలనీలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన మద్దూరి శివరామయ్య, అనురాధ దంపతులు. పదేళ్ల క్రితం అనురాధ(36) సీరియల్స్‌లో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేయగా భార్యాభర్తలు హైదరాబాద్‌లోని రాంనగర్‌లో ఉండేవారు. అయితే శివరామయ్య భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగాయి. దీంతో నటనకు స్వస్తి చెప్పి న ఆమె భర్తతో కలిసి సొంతూరైన షాద్‌నగర్‌కు వచ్చేసి, టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తోంది. అయినా భర్త వేధింపులు ఆగలేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమెతో గొడవపడిన శివరామయ్య గొంతుకు తాడు బిగించి హతమార్చాడు. ఎవరికీ అనుమానం రాకుండా.. ఆమే ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు.

పరారీలో నిందితుడు


హత్య అనంతరం శివరామయ్య వనపర్తి జిల్లా కొత్తకోట మండలం మధునాపురంలోని అత్తవారింట్లో ఉన్న కూతురుకు ఫోన్ చేసి 'మీ అమ్మ ఉరేసుకుంది' అని చెప్పాడు. దీంతో ఆమె వెంటనే షాద్‌నగర్‌కు వచ్చి ఇంట్లోని బెడ్‌రూంలో తల్లి మృతదేహం పడి ఉండటాన్ని చూసింది. అప్పటికే శివరామయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. తండ్రి చెప్పిన మాటలకు పొంతన లేకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం వివరాలు సేకరించారు. శివరామయ్యను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. ఘటనాస్థలం వద్ద ఆయన వదిలి వెళ్లిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.



హత్యకు గురైన అనురాధ

బాలుడి ప్రాణం తీసిన నిర్లక్ష్యపు డ్రైవింగ్

మీర్‌పేట: ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. కారు ఢీకొట్టిన ప్రమాదంలో గాయాల పాలైన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌కు చెందిన వరికుప్పల రామకృష్ణ, జ్యోతి దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి హస్తినాపురం జెడ్పీ రోడ్డులో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రామకృష్ణ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరికి 7 నెలల పాప, ఒక బాబు దీక్షిత్ (22 నెలలు) ఉన్నారు. ఆదివారం రాత్రి 7.30 గంటలకు చిన్నారి దీక్షిత్ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా ఇంటి యజమాని దినేష్‌రెడ్డి కారును నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టాడు. దీంతో చిన్నారి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే దినేష్‌రెడ్డి తన కారులో తీసుకెళ్లి కామినేని ఆసుపత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతూ చిన్నారి దీక్షిత్ అర్ధరాత్రి 2 గంటలకు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దినేష్‌రెడ్డి అక్కడి నుంచి పరారయ్యాడు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాదం జరిగిన ఇంటి వద్ద సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా దినేష్‌రెడ్డి కారుతో బాలుడిని ఢీకొట్టినట్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు.



దీక్షిత్ (ఫైల్)

వైద్యురాలిని అభినందించిన సీఎం

షాద్‌నగర్ రూరల్: పట్టణానికి చెందిన వైద్యురాలు డీకే వీణ హైదరాబాద్‌లోని కోఠీ ఈఎన్‌టీ ఆసుపత్రిలో పని చేస్తుంది. మూగ, చెవిటి పిల్లలకు కాక్లర్ సర్జరీ ద్వారా మాటలు రావడం, చెవులు వినిపించేలా చేశారు. విధి నిర్వహణలో భాగంగా ఇప్పటి వరకు ఆమె వెయ్యి మందికిపైగా శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. దీంతో రాఖీ పండగ సందర్భంగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి డాక్టర్ డీకే వీణను ప్రత్యేకంగా అభినందించారు.



సీఎం రేవంత్‌రెడ్డితో వైద్యురాలు డీకే వీణ

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


రాజబాబు మృతదేహం

తలకొండపల్లి: మద్యం మత్తులో సోదరులతో ఘర్షణ పడి మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భీంరైక్వార్, అర్జున్ రైక్వార్, రాజబాబు రైక్వార్‌లు అన్నదమ్ములు. వీరు రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం వలస వచ్చారు. ఖానాపూర్‌లో నివాసం ఉంటూ పలుగు కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల రాజబాబు రైక్వార్(33) తరచూ మద్యానికి బానిసయ్యాడు. అదే క్రమంలో ఆదివారం సాయంత్రం మద్యం తాగొచ్చి అన్నదమ్ములతో గొడవ పెట్టుకున్నాడు. దీంతో మధ్యలోనే సోదరుడిని వదిలి అన్నదమ్ములు తమ గదిలోకి వెళ్లి నిద్రించారు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి.. మీ తమ్ముడు చెట్టుకు ఉరి వేసుకున్నాడని అన్నదమ్ములకు చెప్పాడు. వెంటనే వాళ్లు వెళ్లి చూడగా జామ చెట్టుకు విగతజీవిగా రాజబాబు ఉన్నాడు. తాగిన మత్తులోనే తమ సోదరుడు ఉరి వేసుకొని మృతి చెందాడని అన్నదమ్ములు భావిస్తున్నారు. మృతుడి అన్న భీంరైక్వార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్‌పై గుర్తుతెలియని మృతదేహం


గుర్తుతెలియని మృతదేహం

ఆమనగల్లు: పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న అపోలో మెడికల్‌షాప్ ముందు డివైడర్‌పై సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. మృతిచెందిన వ్యక్తి వయసు 55 వరకు ఉంటుందని, ఒంటిపై బ్లూ కలర్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్‌ను ధరించి ఉన్నాడని ఆయన చెప్పారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు ఆమనగల్లు పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

ర్యాష్ డ్రైవింగ్.. ఆటో సీజ్

పట్టణంలో సోమవారం మధ్యాహ్నం రాంగ్‌రూట్‌లో వాహనం నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన పట్టణానికి చెందిన వంశీపై కేసు నమోదు చేసినట్లు ఆమనగల్లు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై హైవే పెట్రోల్ మొబైల్ ఇన్‌చార్జి, ఏఎస్‌ఐ కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆటో సీజ్ చేసినట్లు ఆయన వివరించారు.

అన్నా..గుర్తుంచుకో..

హెల్మెట్ లేని, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు రాఖీలు కట్టిన ట్రాఫిక్ పోలీస్‌లు..

నాగోలు: రక్షాబంధన్ సందర్భంగా రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు సోమవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్, కొత్తపేట చౌరస్తాల వద్ద మహిళా కానిస్టేబుళ్ల రాఖీ కట్టించి హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ జగదీష్ మాట్లాడుతూ తోబుట్టువులకు ఎలా అయితే రక్షణ ఇస్తామో.. మన ప్రాణాలను కాపాడే హెల్మెట్, సీట్ బెల్ట్ వాహనదారులు అందరూ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ మనకు ఎంతో రక్షణ కల్పిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ అదనపు సీఐ సర్వర్ అహ్మద్ పాల్గొన్నారు.

'పట్నం' డిపోకు డీలక్స్ సర్వీసులు


ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన మెట్రో డిలక్స్ బస్సు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో తొలిసారిగా నాలుగు డీలక్స్ బస్సులు వచ్చిచేరాయి. డిపో ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ ఇక్కడ డీలక్స్ పేరుతో బస్సులను నడపలేదు. కొత్తగా మెట్రో డీలక్స్ పేరుతో వచ్చిన ఈ బస్సులను 279 రూట్‌లో ఇబ్రహీంపట్నం– జేబీఎస్ రూట్లో నడుపుతున్నారు. మెట్రో ఎక్స్‌ప్రెస్ మాదిరిగానే అన్ని స్టేజీల్లోను దీన్ని ఆపుతారు. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత ప్రయాణం ఇందులో వర్తించదు. డీలక్స్ సర్వీసుల్లో ప్రయాణించే యువతులు, మహిళలు విధిగా టికెట్ తీసుకోవాల్సిందే.

ఆర్టీసీ బస్సు ఢీ.. ఆటో డ్రైవర్ మృతి

హయత్‌నగర్: వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొంగరకలాన్‌కు చెందిన గోపగల్ల జనార్ధన్(42) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొహెడలోని ఓ రిసార్టుకు తన ఆటోలో చికెన్ తరలిస్తుండగా.. నారాయణ కళాశాల మలుపు వద్ద వెనక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన జనార్దన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బర్త్‌డే ఈవెంట్ పేరుతో మోసం

నలుగురిపై కేసు నమోదు

చైతన్యపురి: బర్త్‌డే ఈవెంట్ పేరుతో నగదు వసూలు చేసి మోసానికి పాల్పడిన నలుగురిపై చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముసారంబాగ్ శాలివాహననగర్‌కు చెందిన దోతుల రాజశేఖర్‌రెడ్డి అనే వ్యాపారి తన పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించాడు. ఇందుకు గాను తన దూరపు బంధువు ఈవెంట్ మేనేజర్‌గా పనిచేసే సుమంత్‌రెడ్డిని సంప్రదించాడు. అందుకు అంగీకరించిన సుమంత్ రెడ్డి తన భార్య సావిత్రి, తండ్రి విక్రమ్‌రెడ్డి, తల్లి సావిత్రిలను పిలిపించి రాజశేఖర్ రెడ్డి పరిచయం చేశాడు. హీరోయిన్ సమంత తమకు బాగా తెలుసునని 500 మంది అతిథులతో ఐటీసీ కోహినూర్‌లో గ్రాండ్‌గా ఈవెంట్ నిర్వహిస్తామని తెలిపాడు. హీరోయిన్‌కు రూ. 30 లక్షలు, ఈవెంట్ నిర్వహణకు రూ.20లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. దీంతో 2022 అక్టోబర్‌లో రాజశేఖర్‌రెడ్డి అతడికి రూ. 50 లక్షలు అందజేశాడు. అయితే ఆతర్వాత తమ నానమ్మ చనిపోవటంతో ఈవెంట్ రద్దు చేసుకుంటున్నట్లు రాజశేఖర్‌రెడ్డి వారికి సమాచారం అందించాడు. అయితే ఈవెంట్‌కు రూ. 5 లక్షలు, సమంతకు రూ. 10 లక్షలు ఇచ్చామని వారిని తిరిగి అడగలేమని, మిగిలిన రూ. 35 లక్షలు 2022 డిసెంబర్ లోగా తిరిగి ఇస్తామని చెప్పిన సుమంత్ రెడ్డి రూ. 7.35 లక్షల చెక్కు ఇచ్చాడు. అప్పటి నుంచి డబ్బుల తిరిగి ఇవ్వాలని పలు మార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

ఆక్రమణలపై ఉక్కుపాదం



- హడలెత్తిస్తున్న హైడ్రా
- ఎప్పుడేమవుతోందనని ప్రముఖుల ఆందోళన
- అక్రమాలకు కొమ్ముకాసిన అధికారుల్లోనూ వణుకు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఏర్పాటు అనంతరం ఇప్పటి వరకు ఎన్నడూ చూడని విధంగా అక్రమ నిర్మాణాలు కుప్పకూలుతుండటంతో పలువురు ప్రముఖులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. రాజకీయ నేతలతో పాటు కొందరు సినీ ప్రముఖులు, మాజీ ఉన్నతాధికారులకు సైతం ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో భారీ భవంతులుండటంతో తమ భవనాలకు ఎక్కడ ముప్పు వచ్చి పడుతుందోనని వణుకుతున్నట్లు సమాచారం. తమకున్న పరిచయాల ద్వారా రాజకీయ నేతలను సంప్రదించినా, వారు సైతం తామేమీ చేయలేమని, హైడ్రా స్వతంత్రంగా వ్యవహరిస్తోందని చెబుతున్నట్లు తెలుస్తోంది. హైడ్రా దూకుడును తట్టుకోలేని కొందరు రాజకీయ నేతలు ఇప్పటికే దాని తీరుపై తమ వైఖరి వెల్లడించడం తెలిసిందే. ఆదివారం గండిపేట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని ఖానాపూర్, చిలుకూరు, అప్పోజీగూడ పరిధిలో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన హైడ్రా అధికారులు.. తదుపరి కార్యాచరణలో భాగంగా హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉండే అజీజ్‌నగర్, కొత్వాల్‌గూడ తదితర ప్రాంతాల్లోని భవనాలపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ఏ ఒత్తిళ్లకు లొంగకుండా, హైడ్రా వ్యవహరిస్తున్న తీరును పలువురు ప్రశంసిస్తున్నారు. గతంలో ఏదైనా భవనాన్ని కూల్చాలంటే, కూల్చివేత ప్రారంభం కాకముందే పైనుంచి అందే ఫోన్ సమాచారాలతోనే ఆగిపోయేవని ఇప్పుడా పరిస్థితి లేదని చెబుతున్నారు.

అధికారుల్లోనూ ఆందోళన..

అక్రమ నిర్మాణాలకు అనుమతులు.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీ) జారీ చేసిన జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ సహా శివార్లలోని పురపాలికల అధికారులూ ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. నిర్మాణం పూర్తికాకుండానే భవనానికి ఓసీ జారీ కావడాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రస్తావించడంతో అలా ఓసీలు జారీ చేసినవారు, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేసిన వారు తమ అక్రమాలు ఎక్కడ వెలుగు చూస్తాయోనని ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అందుకు బాధ్యులుగా తమపై కూడా చర్యలుంటాయేమోననే కలవరపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం హైడ్రా చర్యలతో అవకతవకలకు పాల్పడ్డ అధికారుల్లోనూ చర్చనీయాంశంగా మారింది.మరోవైపు పర్యావరణ పరిరక్షణకు కూడా హైడ్రా తరహా వ్యవస్థ ఉండాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ప్రభుత్వాన్ని కోరింది. మొత్తానికి హైడ్రా ఏర్పాటైన అనతికాలంలోనే తన పని తీరుతో ప్రత్యేకతను చాటుకుంటోంది.

కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు


ప్రసాద్ (ఫైల్)

అమీర్‌పేట: కారు ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట మోతీలాల్ నెహ్రూనగర్‌కు చెందిన ప్రసాద్ (19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బంధువులతో కలిసి మెదక్ చర్చికి వెళ్లిన అతను ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళుతుండగా మైత్రివనం చౌరస్తా సమీపంలో ఎస్‌ఆర్‌నగర్ వైపు నుంచి అమీర్‌పేట వైపు వెళ్తున్న కారు వెనక నుంచి అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు సమీపంలోని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో భావన అనే మహిళ కారు నడుపుతున్నట్లు గుర్తించారు. ఎల్‌బీనగర్ కొత్తపేటకు చెందిన భావన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. హైటెక్ సిటీ నుంచి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి తల్లిదండ్రుల ఆందోళన

ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులతో కలిసి ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళకు దిగారు. మృతుడి తండ్రి సాయిలు వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా తల్లి యశోధ ఇళ్లలో పనిచేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు.

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు!

యాచారం: మండల కేంద్రంలో సోమవారం వీధి కుక్కలు హంగామా సృష్టించాయి. ఎస్‌బీఐ ఎదురుగా జోవియల్ ఉన్నత పాఠశాల వెనుకాల కాలనీలో రాకపోకలు సాగిస్తున్న వారిని పరుగులు పెట్టించాయి. ఇదే మార్గంలో బైక్‌లపై నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ, నందివనపర్తి గ్రామాలకు వెళ్తున్న వారి వెంటపడ్డాయి.


యాచారంలో జోవియల్ ఉన్నత పాఠశాల వెనుకాల రోడ్డుపై ఉన్న వీధి కుక్కలు

జ్ఞాపకాలను బంధించి.. వెలుగులు పంచి


ఆమనగల్లు: కేకు కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకుల

ఛాయాచిత్రం.. మానవ బంధాలతో పెనవేసుకున్న అద్భుత సృష్టి. మధుర అనుభవాలను బంధించి తీరిక వేళల్లో మనసుకు ఉల్లాసాన్ని పంచే సాధనం. జ్ఞాపకాలను పదిలంగా దాచుకొని భావితరాలకు అందిస్తోంది. అలాంటి సుందర దృశ్యాలకు సృష్టికర్త అయినా లూయిస్ డాగురెను స్మరించుకుంటూ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



చేవెళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న శివలింగంగౌడ్

ఆమనగల్లు: పట్టణంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద లూయిస్ డాగురె చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం, ఉపాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, ప్రధాన కార్యదర్శి జావేద్, కోశాధికారి వెంకటేశ్‌యాదవ్, సభ్యులు ఎంఎ.అలీం, ఖలీం, జబ్బార్, యాదగిరి, నాజర్, శ్రీకాంత్, మహేశ్, రాజు, నర్సింహ, శేఖర్, కఫార్, రఫీ, ప్రవీణ్‌రెడ్డి, గణేశ్, శ్రీశైలం, మహేశ్ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీతో స్వయం ఉపాధి

తలకొండపల్లి: మధుర జ్ఞాపకాల్ని పంచడమే కాదు. మనతో లేనివారి స్మృతులను కూడా ఫొటో పంచుతుందని మండల ఫొటోగ్రఫీ గౌరవ అధ్యక్షుడు రవూఫ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. అనంతరం రవూఫ్ మాట్లాడుతూ.. నేడు ఫొటోగ్రఫీ అనేది స్వయం ఉపాధిగా మారిందని, ఎందరో యువకులు ఫొటోగ్రఫీపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఫొటోగ్రఫీ రంగానికి ఆదరణ పెరిగిందని, అనేక యూనివర్సిటీలు శిక్షణ ఇస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఫొటోగ్రాఫర్‌లకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ మండలాధ్యక్షుడు నర్సింహ, ఉపాధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి మహేశ్, సభ్యులు రమేశ్, విజయ్, శేఖర్, శ్రీను, కిరణ్, చెన్నకేశవులు, తరుణ్, వేణు, గిరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఫొటోగ్రఫీలో సాంకేతిక పరిజ్ఞానం

చేవెళ్ల: ఫొటో, వీడియో అనేవి జ్ఞాపకాలను గుర్తు చేసేవిగా ఉంటాయని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్, కార్యదర్శి శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫాంహౌస్‌లో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అనాటి నుంచి నేటి వరకు ఫొటోగ్రఫీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతూ వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మందు గోలీల్లేవ్..!

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ...

- పీహెచ్‌సీల్లో మందుల కొరత
- యాంటీబయాటిక్స్ కొన్నింటికే పరిమితం.
- రక్తపోటు, షుగర్, నొప్పులు, విరేచనాలకు సంబంధించిన మందులు అంతంతే..
- సర్దుబాటు చేస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అయితే పలు ఆరోగ్య కేంద్రాల్లో మందులు కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ వేళల్లోనే ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది. అయితే ప్రస్తుతం జ్వరాలు, ఇతర వ్యాధుల బారిన పడిన వారు దవాఖానాలకు బారులు తీరుతుండటంతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా అన్ని దవాఖానాలు జ్వర బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. వాతావరణ మార్పులు అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. దీంతో జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ , వైరల్ ఫీవర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. పిల్లలు, వృద్ధులు, పెద్దలనే అనే తేడా లేకుండా మంచాన పడుతున్నారు. జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (మేడ్చల్, ఘట్కేసర్, శామీర్‌పేట)ఉన్నాయి. అలాగే 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఇందులో 11 పీహెచ్‌సీల్లో డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 26 యూపీహెచ్‌సీలు ఉండగా, ఇందులో ఆరు డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 103 పల్లె,71 బస్తీ దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. జిల్లాలో 24 గంటలు పని చేసే 13 ఆసుపత్రుల్లో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు ఉన్నాయి.పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ప్రతి రోజు ఓపీలో భాగంగా బయటి రోగుల సంఖ్య సాధారణంగా 80 నుంచి 125 ఉండగా, ప్రస్తుత సీజన్‌లో 200పైగా ఆసుపత్రులకు తరలి వస్తున్నారు. ఏరియా ,కమ్యూనిటి ఆసుపత్రుల్లో వీరి సంఖ్య మరింత అధికంగా ఉంటోంది. అయితే ఆయా ఆసుపత్రుల్లో సిబ్బంది కొరతకు తోడు మందులు సరిపడా మందులు లేవు. కనీసం డైక్లోఫినాక్ మాత్రలు సైతం అందుబాటులో లేని దయనీయ పరిస్థితి నెలకొంది. యాంటీ బయాటిక్స్ నిల్వలు కొంత వరకే ఉన్నాయి. కీళ్ల నొప్పులు, జలుబు, వాంతులు, విరేచనాలు, రక్తపోటుతో పాటు.. చర్మ వ్యాధులకు సంబంధించిన మాత్రలు, దురదలకు సంబంధించిన ఆయింట్మెంట్స్ కొరత తీవ్రంగా ఉంది.